సాక్షి నంద్యాల
శనివారం ♦ 21 ♦ అక్టోబర్ ♦ 2023



కిడ్నాపర్ల అరెస్ట్

క్రషర్ వ్యాపారి కిడ్నాప్ కేసులో ప్రధాన నిందితుడితో సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రెండు విడతల్లో రూ.3.6 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. IIలో



బెట్టింగ్‌రాయుళ్ల 'ఆట'కట్టు

ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురిని ఆదోని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.8,25,000 నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. IIలో



కేసీ కాల్వకు నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.రిజర్వాయర్‌లో 0.661 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

న్యూస్‌రీల్

రూ.20 కోట్లతో అతిథి గృహాల నిర్మాణం



స్థలాన్ని పరిశీలిస్తున్న ఇంజినీర్లు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలో రూ.20 కోట్లతో త్వరలో రెండు ప్రభుత్వ అతిథి గృహాలను నిర్మించేందుకు జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్‌చీఫ్ ఆదేశాలు జారీ చేశారు. జలవనరుల శాఖ పాత అతిథి గృహాల స్థానంలో నూతనంగా రూ.5 కోట్లతో నిర్మాణాలు చేపట్టేందుకు పరిపాలనా అనుమతులు వచ్చాయి. నిధులను కూడా కేటాయించినట్లు క్యాంప్స్ అండ్ బిల్డింగ్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. మరో రూ.15 కోట్లతో డ్యాం వ్యూ నూతన అతిథిగృహం సమీపంలో జి ప్లస్ త్రీ అతిథి గృహాన్ని నిర్మించేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలని కూడా ఆదేశించినట్లు ఈఈ తెలిపారు. జి ప్లస్ త్రీ నూతన అతిథి గృహ నిర్మాణం కోసం జలవనరుల శాఖకు చెందిన 30 ఎకరాల స్థలంలో అనువైన స్థలాన్ని ఎంపిక చేయడానికి సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సర్వేలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మురళీబాబు రావు, తంగరాజు, అసిస్టెంట్ ఇంజినీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

అయోధ్యకు 'ఆళ్లగడ్డ' బలరాముడు



అయోధ్య రామమందిరం కోసం తయారు చేసిన బలరాముడి విగ్రహం

నంద్యాల(వ్యవసాయం): అయోధ్యలో త్వరలో ప్రారంభమయ్యే శ్రీరామ మందిరానికి ఆళ్లగడ్డలో బలరాముడు విగ్రహం తయారు చేశారు. శుక్రవారం ఈ విగ్రహం నంద్యాలకు చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీ భగవత్ సేవా సమాజ్ సభ్యులు బలరాముడి విగ్రహానికి మేళతాళాలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా సముద్రాల సూరయ్య, దేవరశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ.. అయోధ్య రామమందిరంలో ప్రతిష్ఠించబోయే శ్రీబలరామ చంద్రుడి విగ్రహాన్ని తయారు చేసే భాగ్యం ఆళ్లగడ్డ శిల్ప కళాకారులకు దక్కడం ఎంతో అదృష్టమన్నారు.

శ్రీశైలం డ్యాంలో 73 టీఎంసీల నీరు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం సాయంత్రం సమయానికి 73.9870 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 847.10 అడుగులకు చేరుకుంది. డ్యాం నుంచి దిగువ ప్రాంతాలకు 8,994 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 1.296 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం నాగార్జున సాగర్‌కు 2,645 క్యూసెక్కులను విడుదల చేశారు. బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 1,500, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,525, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 735, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

ఆశల సాగు ఆరంభం

- ప్రారంభమైన శనగ విత్తన పనులు
- జిల్లాలో 68 వేల హెక్టార్లలో సాగు లక్ష్యం
- కోవెలకుంట్ల సబ్ డివిజన్‌లో సాగు అధికం
- అనుకూలంగా మారిన వర్షాలు
- 40 శాతం సబ్సిడీపై విత్తనాల పంపిణీ



కోవెలకుంట్ల సమీపంలో సాగు చేసిన శనగ

కోవెలకుంట్ల: కోటి ఆశలతో శనగ రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. మరో సారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సమాయత్తమవుతున్నారు. ఈ ఏడాది అక్టోబర్ 1వ తేదీ నుంచి రబీ సీజన్ ప్రారంభం కాగా సీజన్ మొదటి పంటగా జిల్లాలో పప్పుశనగ విస్తారంగా సాగు కానుంది. శనగ సాగుకు అదును కావడంతో రైతులు విత్తన పనుల్లో నిమగ్నమయ్యారు. ఏటా జిల్లాలోనే అత్యధిక విస్తీర్ణంలో కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో శనగ పంట సాగవుతోంది. విత్తనానికి ముందే వర్షాలు అనుకూలంగా మారడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది 68 వేల హెక్టార్లలో శనగ సాగు సాధారణ విస్తీర్ణంగా కాగా ఇందులో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల పరిధిలో 41,202 హెక్టార్లలో సాగు కావాల్సి ఉంది. శనగసాగును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సబ్సిడీతో విత్తనాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. జిల్లాకు ఇప్పటికే 23,947 క్వింటాళ్ల విత్తనాలను కేటాయించింది. క్వింటా పూర్తి ధర రూ. 8,100 కాగా 40 శాతం సబ్సిడీ(రూ.3,240) పోనూ క్వింటా రూ. 4,860 ప్రకారం రైతులకు సరఫరా చేస్తున్నారు. జిల్లాలోని ఆయా రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తనాలను రైతులు అందజేస్తున్నారు.

నవంబర్ 15 వరకు అదును..

గత ఏడాది విత్తనానికి ముందే సకాలంలో వర్షాలు కురవడంతో సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో ఆశించిన స్థాయిలో దిగుబడులు లభించాయి. రసాయన ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులు, కోత, నూర్పిడి, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 12 వేల వరకు వెచ్చించారు. వాతావరణం అనుకూలించి ఎకరాకు సగటున 7 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు క్వింటా రూ. 5,200తో దిగుబడులను విక్రయించింది. గత ఏడాది శనగసాగు అన్ని విధాలా కలిసి రావడంతో ఈ ఏడాది సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. వచ్చే నెల 15వ తేదీ వరకు సాగుకు అనుకూలం కావడంతో విత్తనానికి పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. ప్రస్తుత మార్కెట్ క్వింటా ధర రూ. 6వేల వరకు మద్దతు ధర ఉండటంతో రైతులు శనగ సాగుపై ఆశలు పెట్టుకున్నారు.

జిల్లాలో శనగ సాగు వివరాలు

సబ్ డివిజన్	సాగు లక్ష్యం (హెక్టార్లలో)	సబ్సిడీవిత్తనాలు (క్వింటాళ్లు)
కోవెలకుంట్ల	41,202	12,450
నందికొట్కూరు	10,475	3,550
ఆళ్లగడ్డ	6,683	2,350
నంద్యాల	6,106	2,987
డోన్	2,111	2,000
ఆత్మకూరు	1,593	610

ఎకరాకు రూ. 15 వేలు పెట్టుబడి



రసాయన మందు విత్తుతున్న రైతన్న

వర్షాధార పంటరకమైన పప్పు శనగ సాగుకు ఎకరాకు రూ. 15 వేలు పెట్టుబడి అవసరం. నల్లరేగటి భూములు పంట సాగుకు అనుకూలం. విత్తనానికి ముందే పదునయ్యే వర్షం, పైరు నెల రోజుల దశలో మరో వర్షం, చలి, మంచుతో పైరు చేతికందుతుంది. సేద్యం, ఎకరాకు రెండు బస్తాల డీఏపీ, విత్తనాలు, నాలుగు రౌండ్ల క్రిమి సంహారక మందులు, కలుపు, కోత, నూర్పిడి, తదితర రూపంలో పెట్టుబడులు వెచ్చించాల్సి ఉంది. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు 8 నుంచి 10 బస్తాల దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది విత్తనానికి ముందే విస్తారంగా వర్షాలు కురియడంతో ఈ ఏడాది సాధారణ విస్తీర్ణం మించి సాగయ్యే సూచనలు ఉన్నట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

23,947 క్వింటాళ్ల విత్తనాల కేటాయింపు

ఈ ఏడాది పప్పుశనగ సాగును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో విత్తనాల పంపిణీ చేసేందుకు జిల్లాకు 23,947 క్వింటాళ్లు కేటాయించింది. ఇప్పటికే 70 శాతం విత్తన పంపిణీ పూర్తయ్యింది. సంజామల మండలానికి అత్యధికంగా 3,200 క్వింటాళ్లు, కోవెలకుంట్లకు 2,850 క్వింటాళ్లు, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ మండలాలకు 1800 క్వింటాళ్ల చొప్పున, దొర్నిపాడుకు వెయ్యి క్వింటాళ్ల సబ్సిడీ శనగలు మంజూరయ్యాయి. సాగు విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా మండలాలకు విత్తన కోటాను మరింత పెంచాలని వ్యవసాయాధికారులు ప్రతిపాదనలు పంపారు. రైతు భరోసా కేంద్రాల్లో విత్తన రిజిస్ట్రేషన్లు వేగవంతంగా కొనసాగుతున్నాయి. గత ఏడాది క్వింటాకు 25 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. ఈ ఏడాది 40 శాతం సబ్సిడీ ఇవ్వడంతో రైతులు విత్తనాలు కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. గ్రేడింగ్ చేసిన నాణ్యమైన విత్తనాలను సరఫరా చేస్తుండటంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఎకరాకు రెండు ప్యాకెట్ల చొప్పున గరిష్టంగా ఐదు ఎకరాల వరకు 1.40 క్వింటాళ్ల విత్తనాలను అందజేస్తున్నారు.

మూడు ఎకరాల్లో సాగు చేశా



నాకున్న మూడు ఎకరాల సొంత పొలంతో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. మూడు ఎకరాల్లో శనగ, మిగిలిన విస్తీర్ణంలో జొన్న సాగుకు పొలాన్ని సిద్ధం చేసుకున్నాను. ప్రభుత్వం 40 శాతం రాయితీతో విత్తనాలు సరఫరా చేస్తోంది. విత్తనానికి ముందే వర్షాలు అనుకూలంగా మారడంతో సాగుకు సిద్ధమవుతున్నాను.

– సుబ్బరాయుడు, రైతు, కోవెలకుంట్ల

నాలుగేళ్లుగా గిట్టుబాటు ధర



గత నాలుగు సంవత్సరాల నుంచి పప్పుశనగకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తోంది. గత ఏడాది వాతావరణం అనుకూలించి మంచి దిగుబడులు వచ్చాయి. పూలేజి రకానికి చెందిన శనగ క్వింటా రూ. 12వేలు, జేజీ–11 రకం రూ. 6,300 వరకు ధర పలికింది. ఈ ఏడాది నాకున్న 70 ఎకరాల విస్తీర్ణంలో 25 ఎకరాల్లో తెల్లశనగ, మిగిలిన విస్తీర్ణంలో ఎర్ర శనగ సాగుకు విత్తనాలను సిద్ధం చేసుకున్నాను.

– గోవిందరెడ్డి, రైతు, గుంజలపాడు, కోవెలకుంట్ల మండలం

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి



ఈ ఏడాది ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో రైతులకు శనగ విత్తనాలను సరఫరా చేస్తోంది. నంద్యాల జిల్లాలో ఆరు వ్యవసాయ సబ్ డివిజన్లు ఉండగా ప్రతి ఏటా కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో శనగ అధిక విస్తీర్ణంలో సాగవుతోంది. ఈ ఏడాది 41వేల హెక్టార్లకు పైగా సాగు సాధారణ విస్తీర్ణం కాగా వాతావరణం అనుకూలంగా మారడంతో మరింత పెరిగే అస్కారం ఉంది. డివిజన్‌కు 12,450 క్వింటాళ్ల విత్తనాలను కేటాయించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– సుధాకర్, ఏడీఏ, కోవెలకుంట్ల

కాత్యాయనీ.. శుభప్రదాయిని

- శ్రీశైలంలో వైభవంగా దసరా నవరాత్రి ఉత్సవాలు
- కాత్యాయనీ అలంకారంలో భ్రామరి
- హంస వాహనంపై దేవదేవుల విహారం



పుష్ప పల్లకీలో ఊరేగుతున్న స్వామిఅమ్మవార్లు



ఆలయ ప్రదక్షిణలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులు



కళాకారుల ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైలంలో దసరా మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో ఆరో రోజు శుక్రవారం భ్రమరాంబాదేవి కాత్యాయనీ స్వరూపంలో దర్శనమిచ్చారు. నాలుగు చేతుల్లో అభయ ముద్ర, కమలం, ఖడ్గాన్ని ధరించి భక్తులను అమ్మవారు కటాక్షించారు. ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై అలంకరించిన అమ్మవారిని ఆశీనులను చేశారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు విశేష పూజా కార్యక్రమాలను జరిపారు. కాత్యాయనీ రూపంలోని అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక నీరాజనాలు సమర్పించారు. అలంకార మండపంలో అలంకరించిన స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను హంసవాహనంపై అధిష్ఠింపజేసి ఆలయ అర్చకులు, వేదపండితులు విశేష పూజలు చేశారు. అనంతరం కాత్యాయనీ దేవికి, హంస వాహనంపై కొలువుదీరిన స్వామిఅమ్మవార్లకు ఆలయ ఉత్సవాన్ని జరిపారు.



శంఖం ఊదుతున్న సాధువు

శ్రీశైలంలో నేడు

దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏడో రోజు శనివారం కాళరాత్రి అలంకారంలో భ్రమరాంబాదేవి, గజవాహనంపై భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

నేత్రానందభరితంగా పుష్పపల్లకీ సేవ

దసరా మహోత్సవాల్లో భాగంగా స్వామిఅమ్మవార్లకు పుష్పపల్లకీసేవ జరిపించారు. వివిధ పుష్పాలతో అలంకరించిన పుష్పపల్లకీ వద్దకు మేళతాళాలతో స్వామిఅమ్మవార్లను తోడ్కొని వచ్చారు. శ్రీశైల పురవీధుల్లో అంగరంగ వైభవంగా పుష్పపల్లకీ గ్రామోత్సవం నిర్వహించారు. పూర్తి ఆధ్యాత్మిక భరితంగా సాగుతున్న ఉత్సవాలతో శ్రీగిరి మరింత ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆయా పూజా కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఏఈవో మోహన్, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బస్సు యాత్రపై నేడు సన్నాహక సమావేశం

- నంద్యాల పట్టణంలో నిర్వహణ
- హాజరుకానున్న ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు

కర్నూలు(రాజ్‌విహార్): నంద్యాల పట్టణంలోని నూనెపల్లె బ్రిడ్జి పక్కనే ఉన్న ఉదయానంద రెసిడెన్సీలో శనివారం ఉదయం 10 గంటలకు 'సామాజిక న్యాయ బస్సు యాత్ర' సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. ఈ నెల 26 నుంచి 'సామాజిక న్యాయ బస్సు యాత్ర' నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నంద్యాలలో ప్రజాప్రతినిధుల సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సమావేశానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నంద్యాల, కర్నూలు జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు ఎబీ అంజాద్ బాషా, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్లు ఆకెపాటి అమర్నాథ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, కర్నూలు, నంద్యాల జిల్లాల 14 మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు, పరిశీలకులు, కేడీసీసీ, డీసీఎంఎస్ చైర్మన్లు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నారు. బస్సు యాత్రను జయప్రదం చేసే అంశంపై పార్టీ పెద్దలు దిశా నిర్దేశం చేయనున్నట్లు పార్టీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య తెలిపారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్లపట్టాలు

- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్ రూరల్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు అందజేస్తున్నట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో శుక్రవారం రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం గ్రామ ప్రజలకు ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డోన్ నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కేవలం ధర్మవరం గ్రామంలో పది కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. గ్రామంలో అర్హత ఉన్న 213 మందికి ఇంటి పట్టాలు అందించామన్నారు. ఇంకా ఎవ్వరైనా అర్హత ఉండి ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో సెల్‌ఫోన్ టవర్ కూడా ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే ప్రతి ఇంటికీ తాగు నీటి కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గంలో 76 చెరువులు నింపే కార్యక్రమం కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. డోన్ నియోజకవర్గం గతంలో కంటే 100 రెట్లు ఎక్కువగానే అభివృద్ధి చెందిందని, టీడీపీ నాయకులు అభివృద్ధి ఎక్కడ అంటూ ప్రశ్నించడం దుర్మార్గం అన్నారు. వారికి కళ్లు ఉన్నాయో లేదో అర్థం కావడంలేదని ఎద్దేవా చేశారు.

మోసగాళ్లను నమ్మవద్దు..

టీడీపీ డోన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి పెద్ద మోసగాడని, ఆయనను నమ్మవద్దని ప్రజలకు మంత్రి సూచించారు. సొంత గ్రామంలో ఇంత వరకు కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని వ్యక్తి నియోజకవర్గంలో ఎలా గెలుస్తాడని అన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు తన సొంత గ్రామమైన ధర్మవరంలో రోడ్డు కూడా వేయలేదన్నారు. గ్రామంలోని ప్రజలు సెల్‌ఫోన్ టవర్‌లేక అల్లాడిపోతుంటే పట్టించుకున్న పాపానపోలేదన్నారు. ఇప్పుడు ఇంటి పట్టాలు ఇస్తామని కొత్త నాటకం మొదలు పెట్టారన్నారు. అయన సొంత డబ్బుతో ఇవ్వాలంటే రూ.1700 కోట్లు అవుతుందన్నారు. గతంలో ప్రభుత్వానికి, ఇప్పుడు ఉన్న ప్రభుత్వానికి తేడా చూడాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రామచంద్రుడు, ఆర్డీఓ వెంకటరెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్, ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ ఎల్లమ్మ, ఉప సర్పంచ్ శ్రీనివాసులు, నాయకులు శ్రీరాములు, భూపాల్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు చంద్రన్న, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పండుగ వేళ 'ప్రైవేట్' దోపిడీ

- దసరా పండగను క్యాష్ చేసుకుంటున్న ట్రావెల్స్ యజమానులు
- డిమాండ్‌ను బట్టి ఇష్టారాజ్యంగా చార్జీల పెంపు
- సాధారణ చార్జీ కంటే రెండు, మూడు రెట్లు అధికంగా వసూలు
- నంద్యాల జిల్లా నుంచి వివిధ ప్రాంతాలకు 17 ట్రావెల్స్ బస్సులు
- నంద్యాల మీదుగా మరో 20 బస్సులు



సాక్షి, నంద్యాల: హైదరాబాద్ నుంచి నంద్యాలకు వచ్చి వెళ్లేందుకు రూ.4 వేల చార్జీ. ఇందుకు కారు సౌకర్యం కల్పిస్తారనుకుంటే పొరబడినట్టే..ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ప్రయాణించేందుకు ఒక్కొక్కరికి వసూలు చేస్తున్న చార్జీ..పండుగ వేళ డిమాండ్‌ను బట్టి ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. గంట గంటకూ టికెట్ రేట్లు మారుస్తూ ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నారు. సాధారణ రోజుల్లో నంద్యాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి, వెళ్లేందుకు రూ.1500 చెల్లించేవారు. ఇప్పుడు రావడానికి పోవడానికి ఒక్కరికే రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది.

భారీగా సెలవులు రావడంతో...

తెలుగువారు సంక్రాంతి తర్వాత అంత పెద్ద పండుగగా దసరాను జరుపుకుంటారు. పాఠశాలలు, కళాశాలలకు సుమారు 10 రోజుల పాటు సెలవులు ఇవ్వడంతో హైదరాబాద్, బెంగళూరు, విజయవాడలో ఉన్న వారంతా సొంత ఊళ్లకు పయనమవుతున్నారు. రైళ్లలో సుమారు మూడు నెలల ముందే రిజర్వేషన్ చేసుకునే సదుపాయం ఉండడంతో టికెట్లు ఇప్పటికిప్పుడు దొరకడం అసాధ్యం. ఇక బస్సుల్లో అప్పటికప్పుడు టికెట్ బుక్ చేసుకోవచ్చు.

పండగను 'క్యాష్' చేసుకుంటూ...

ప్రయాణికుల అవసరాలనే ట్రావెల్స్ యజమానులకు వరంగా మారుతున్నాయి. సాధారణ రోజుల్లో నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె నుంచి హైదరాబాద్‌కు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో నాన్ ఏసీ ఒక్కో టికెట్‌కు రూ.600 నుంచి రూ.850 వరకు వసూలు చేస్తున్నారు. పండుగ రోజుల్లో ఇదే టికెట్‌ను రూ.1,400 నుంచి రూ.1,700 వరకు పెంచారు. ఏసీ బస్సుల్లో రూ.900 ఉన్న టికెట్ రేట్‌ను రూ.2 వేలకు పెంచారు. నంద్యాల జిల్లాలో 17 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ఉండగా జిల్లా మీదుగా హైదరాబాద్‌కు వెళ్లే ప్రైవేటు బస్సు సర్వీసులు మరో 20 వరకు ఉన్నాయి.

అనుమతులు లేకున్నా...

సాధారణంగా ట్రావెల్స్ యజమానులు టికెట్ రేట్లు పెంచుకోవాలంటే ప్రభుత్వం అనుమతి తప్పనిసరి. కానీ, ఏ ఒక్క ట్రావెల్స్ యజమానులు ఈ నిబంధనను పాటించడం లేదు. డిమాండ్ పేరుతో ఇష్టమొచ్చినట్లు టికెట్ రేట్లు నిర్ణయిస్తున్నారు. ఎవరైనా ప్రయాణికులు ఇంత రేటేంటని ప్రశ్నిస్తే టికెట్ తీసుకుంటే తీసుకోండి.. లేదంటే వెళ్లండంటూ దురుసుగా సమాధానమిస్తున్నారు.

రూ.10 వేల వరకు జరిమానా

అనుమతి ఉన్న మేరకే చార్జీలు వసూలు చేయాలి. ఈ నెల 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. డోన్, నంద్యాల ఎన్‌హెచ్‌పై ట్రావెల్స్ తనిఖీలు చేపడతాం. మా తనిఖీలలో అధిక రేటుకు టికెట్లు విక్రయించారని తెలిస్తే రూ.10 వేల వరకు జరిమానా విధించడంతో పాటు ఉన్న సీట్ల కంటే ఎక్కువగా ప్యాసెంజర్లను ఎక్కిస్తే కేసులు కూడా నమోదు చేస్తాం. ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకుంటాం.

– జీవీ శివారెడ్డి, జిల్లా రవాణా అధికారి, నంద్యాల

క్లుప్తంగా

దొంగకు ఏడాది జైలు శిక్ష

ఆళ్లగడ్డ: చోరీ కేసులో నేరం రుజువు కావడంతో దొంగకు ఏడాది జైలు శిక్ష విధించినట్లు రూరల్ ఎస్‌ఐ నరసింహులు శుక్రవారం తెలిపారు. 2017 సెప్టెంబర్ 3వ తేదీన బత్తలూరు గ్రామానికి చెందిన అవుకు ఓబులేసు ఇంట్లో చోరీ జరిగింది. రూ. 2 లక్షల నగదు, 9.5 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. ఈ కేసుకు సంబంధించి కేసు నమోదు చేసుకున్న రూరల్ పోలీసులు విచారించి అబ్దుల్ సుభాన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా ఈ కేసు విచారించిన కర్నూలు జువినైల్ జస్టిస్ బోర్డు కోర్టు నేరం రుజువు కావడంతో అబ్దుల్ సుభాన్‌కు ఏడాది జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా

పాణ్యం: కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా పడింది. ఎస్‌ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు నుంచి 483 సిలిండర్ల లోడ్‌తో కనిగిరికి బయలుదేరిన లారీ పాణ్యం సమీపంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. గ్యాస్ సిలిండర్లు కావడంతో వాహనదారులు భయాందోళన చెందారు. అయితే లారీకి గ్రిల్ ఉండటంతో ఒక్క సిలిండర్ కూడా రహదారిపై పడలేదు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ అమీర్‌బాషకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. విషయం తెలుసుకున్న హైవే పెట్రోల్ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని హైవేపై లారీని తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారన్నారు.

పని చేయకపోతే సస్పెన్షనే!

- అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, చిత్రంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

వెలుగోడు: నిర్లక్ష్యంగా ఉద్యోగాలు చేస్తే కుదరదు, పని చేయకపోతే సస్పెండ్ చేయాల్సి వస్తుందని అధికారులపై జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శ్యామూన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలుగోడు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. రెవెన్యూ సమస్యలు 46 పెండింగ్‌లో ఉన్నాయని, ఆత్మకూరు ఆర్‌డీవో దాసు వెలుగోడును ఎన్నిసార్లు సందర్శించారని ఆర్‌డీవోను కలెక్టర్ ప్రశ్నించారు. వీఆర్‌వోలు పని చేయకపోతే సస్పెండ్ చేయాలని ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియపై చాలా గ్రామాల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వీఆర్‌ఓలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల స్థాయిలో వచ్చిన 117 ప్రజా ఫిర్యాదులపై సంబంధిత అధికారులు పూర్తిస్థాయి దృష్టి సారించి నిర్ణీత కాల వ్యవధిలోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వారంలో నాలుగు సచివాలయాలను ఎంపీడీవో తనిఖీ చేయాలని ఆదేశించారు. శానిటేషన్ పనులు సరిగా లేవని, పనితీరు మెరుగుపరిచాలని సూచించారు. ఎంఈవో సమావేశాలకు సరిగా వెళ్లడం లేదని డీఈవో నుంచి ఫిర్యాదులు వచ్చినట్లు చెప్పారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు సరిగా పని చేయడం లేదని, రికార్డులన్నీ తప్పుల తడకగా ఉన్నాయన్నారు. మండల వ్యవసాయ అధికారి పవన్‌కుమార్ ఈ–క్రాప్ నమోదును 100 శాతం చేయడం పట్ల కలెక్టర్ అభినందించారు. జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గత 5 నెలల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై అసంతృప్తి ఉన్నట్లు సర్వేలో వెల్లడైందన్నారు. వీఆర్వోలు సరిగా పనిచేయకపోతే సస్పెండ్ చేసేందుకు కూడా వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు. ప్రతిరోజు 100 ఎకరాల గ్రౌండ్ ట్రూతింగ్ జరగాలన్నారు.

భూకబ్జాదారులకు అవకాశం ఇవ్వొద్దు

రెవెన్యూ విభాగంలో లొసుగులు ఉన్నాయని, భూకబ్జాదారులకు అవకాశం ఇవ్వొద్దని ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సూచించారు. దళారులు తప్పుడు రికార్డులు తయారు చేసుకొని అమ్ముకుంటున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ, మున్సిపాలిటీ, ఎండోమెంట్ భూముల్లో అడ్డగోలుగా అక్రమాలు జరుగుతున్నాయని, భూ సర్వేను పకడ్బందీగా చేయాలని సూచించారు. దేవుని మాన్యం భూముల వివరాలను సచివాలయం వద్ద జాబితాను ఏర్పాటు చేయాలన్నారు. పేద ప్రజలకు ఇళ్లు లేకున్నా..ఉన్నట్లు సాధికారత సర్వేలో చూపిస్తున్నారని, ఈ సమస్యలకు పరిష్కారం చూపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరం క్యాంపు నియోజకవర్గ స్థాయి నుంచి మండల స్థాయిలో కూడా నిర్వహిస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎన్నో సమస్యలు వచ్చాయని, అధికారులు వీటిలో కొన్నింటిని పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయారన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్ సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బెట్టింగ్ రాయుళ్ల 'ఆట'కట్టు

- ముగ్గురు ఆన్‌లైన్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్
- రూ.8,25,000 నగదు, ఎనిమిది సెల్‌ఫోన్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శివనారాయణస్వామి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోని అర్బన్: వరల్డ్ కప్ సీజన్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురిని ఆదోని త్రీటౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.8,25,000 నగదు, ఎనిమిది సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరికొంత మంది పరారీలో ఉన్నారని, వారిని త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. శుక్రవారం స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలను వెల్లడించారు. గురువారం ఇండియా, బంగ్లాదేశ్ మధ్య మ్యాచ్ ఉండటంతో ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ సాగుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు త్రీటౌన్ సీఐ నరసింహరాజు, పెద్దతుంబళం ఎస్‌ఐ చిన్నపీరయ్య, కానిస్టేబుళ్లు లక్ష్మన్నస్వామి, నరేంద్ర, రాజశేఖర్, కాశీంవలీ, గిరిబాబు, ఇస్మాయిల్ బృందంగా ఏర్పడి ఆదోని పట్టణం ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డు వద్ద ఉన్న వికాస్ డాబా వెనక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న మసీదాపురకు చెందిన ఇస్మాయిల్‌బాషా, ఎల్‌బీ స్ట్రీట్‌కు చెందిన శివమూర్తి, పింజారి గేరికి చెందిన ఉసేనిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.8,25,000 నగదు, ఎనిమిది సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. బెట్టింగ్ నిర్వాహకుల్లో ముఖ్యమైన హైదరాబాద్‌కు చెందిన ఇస్మాయిల్, ఐజకు చెందిన వడ్ల రాఘవేంద్ర ఆచారిలను కూడా త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలియజేశారు.

ఎలా బెట్టింగ్ చేస్తారంటే..

హైదరాబాద్‌కు చెందిన ఇస్మాయిల్‌బాషా ఒక యాప్‌ను తయారు చేసి, ఆయనకు సంబంధించిన ఏజెంట్లకు పంపిస్తారు. ఆ ఏజెంట్లు ఒక టీంను తయారు చేసి ఎవరైతే క్రికెట్ ఆడతారో వారికే ఫోన్‌లో యాప్‌ను పంపిస్తారు. దీంతో ఆన్‌లైన్‌లో క్రికెట్ చూసుకుంటూ ఈ వరల్డ్‌కప్ సీజన్‌లో కేవలం గెలుపు, ఓటములపై 1:2, 1:5 బెట్టింగ్ నిర్వహించి లావాదేవీలను ఫోన్‌పే ద్వారానే జరుపుతారని డీఎస్పీ తెలియజేశారు. బెట్టింగ్ నిర్వాహకుడు ఇస్మాయిల్‌బాషా కింద ఉన్న ఒక బృందంలో ఐజకు చెందిన వడ్ల రాఘవేంద్ర ఆచారి ఉన్నారని తెలిపారు. ఈయన కింద ఆదోని పట్టణంలో కొందరని టీంగా తయారు చేసుకొని బెట్టింగ్ వ్యవహారం నడుపుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. సీజన్‌లో రూ.కోటి పైనే లావాదేవీలు జరిగాయనే అంచనా ఉందన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ పేరుతో మోసం జరుగుతోందని, యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

'ప్రత్యామ్నాయ' సాగును ప్రోత్సహించాలి

- జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగల భరత్ కుమార్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న భరత్‌కుమార్‌రెడ్డి

నంద్యాల: తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులకు జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. మార్క్ ఫెడ్ చైర్మన్ పీపీ నాగి రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సాగునీటి కాలువల పరీవాహక పొలాల్లో వరికి బదులు మొక్కజొన్న, జొన్న, చిరుధాన్యపు పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. ఉద్యాన శాఖ ద్వారా కొత్త వాణిజ్య పంటలను అన్వేషించి రైతులు వేసుకునేలా ప్రోత్సహించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజుకు సూచించారు.సబ్సిడీ కింద రైతు భరోసా కేంద్రాల ద్వారా నీమ్ ఆయిల్ అందజేయాలన్నారు. మిరప, పత్తి పంటలు జిల్లాలో అధిక శాతం దెబ్బతిన్నాయని, ఈ మేరకు వ్యవసాయ కమిషనర్‌కు లేఖ రాయాలని జాయింట్ కలెక్టర్‌కు సూచించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల వేసిన పంటకు ఈ క్రాప్ బుకింగ్‌తో పాటు ఈ కేవైసీ కూడా పూర్తిస్థాయిలో చేయాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమయ్యే విత్తనాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఏపీ సీడ్స్, మార్క్‌ఫెడ్ అధికారులకు సూచించారు. వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన విత్తనాలను రైతులకు పంపిణీ చేయాలన్నారు. ఎంతమంది రైతులకు ఎన్ని క్వింటాళ్ల పంపిణీ చేసారనే వివరాలు అడిగి తెలుసుకుంటూ ఈ నెల 25వ తేదీలోగా నివేదిక అందచేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమయ్యే సూచనలు, సలహాలు ఇచ్చేందుకు వ్యవసాయ శాఖ ఏడీఏలు, గ్రామ వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయి సిబ్బంది విస్తృతంగా పర్యటించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవిద్దాం



జూమ్ కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ సలీమ్‌బాషా, డీపీఎంలు, ఏపీఎంలు

కర్నూలు(అగ్రికల్చర్): డీఆర్‌డీఏ–వైకేపీ కార్యాలయాల్లో మహిళల పట్ల గౌరవంగా మెలగాలని సెర్ప్ మానవ వనరుల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, ఎస్‌ఆర్‌ఎంఎం నేషనల్ రిసోర్స్ పర్సన్ అనురాధ అన్నారు. శుక్రవారం విజయవాడ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా వైకేపీ కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ అనే అంశంపై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యాలయాల్లో ప్రతి ఒక్కరినీ అక్కాచెల్లెళ్లుగానే చూడాలన్నారు. మహిళలను లైంగికంగా వేధింపులకు గురి చేస్తే తగిన చర్యలు తప్పవనే విషయం గుర్తించాలన్నారు. అన్ని కార్యాలయాల్లో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలని, నేరుగా చెప్పుకోలేని వారు తమ వేదనను రాతపూర్వకంగా ఈ బాక్స్‌లో వేయవచ్చన్నారు. వీటిపై వెంటనే స్పందిస్తామన్నారు. జూమ్‌లో డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా, డీపీఎంలు నరసమ్మ, అయ్యమ్మ, ఏపీఎంలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డుకు వరుస సెలవులు

నంద్యాల(సెంట్రల్): విజయదశమి పర్వదినం సందర్భంగా నంద్యాల మార్కెట్‌యార్డుకు వరుస సెలవులు వచ్చాయి. శని, ఆదివారాలు సాధారణ సెలవులు ఉండటంతో పాటు దసరా పర్వదినం సందర్భంగా సోమ, మంగళవారాలు రాష్ట్ర ప్రభుత్వం మిర్చి యార్డుకు సెలవులు ప్రకటించిందని మార్కెట్‌యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి కల్పన తెలిపారు. ఈనెల 25వ తేదీ బుధవారం నుంచి యార్డులో యథావిధిగా క్రయవిక్రయాలు కొనసాగుతాయని వెల్లడించారు. రైతులు సెలవు రోజుల్లో యార్డుకు మిర్చి బస్తాలు తీసుకొని రావద్దని ఆమె విజ్ఞప్తి చేశారు

కిడ్నాపర్ల అరెస్ట్

గత జూన్‌లో బనగానపల్లె క్రషర్ వ్యాపారి కిడ్నాప్

- రూ.4 కోట్లు తీసుకుని వ్యాపారితో పాటు కుమారుడి విడుదల
- మాజీ డ్రైవర్‌తో పాటు మరికొందరి హస్తం
- తాజాగా ప్రధాన నిందితుడు సహా ముగ్గురి అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: జేసీబీ డ్రైవర్ ఏకంగా తన యజమానినే కిడ్నాప్ చేసి రూ.4కోట్లతో ఉడాయించిన ఘటన గత జూన్‌లో కలకలం రేపింది. ఈ కేసుకు సంబంధించి గతంలో 11 మందిని అరెస్టు చేయగా, ప్రస్తుతం ప్రధాన నిందితుడు సహా ముగ్గురిని అరెస్టు చేశారు. వీరి నుంచి రెండు విడతల్లో రూ.3.6 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బనగానపల్లి పట్టణానికి చెందిన వినాయకరెడ్డి క్రషర్ వ్యాపారం చేస్తూ ఉమ్మడి జిల్లాలో పారిశ్రామికవేత్తగా పేరు గడించాడు. అనంతపురం జిల్లా పెద్దవడుగూరు గ్రామానికి చెందిన నరేష్ ఇతని వద్ద గత నాలుగేళ్లుగా జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే క్రమంగా ప్రవర్తనలో మార్పు కనిపించడంతో వినయకరెడ్డి అతడిని తొలగించాడు. ఇది మనసులో పెట్టుకున్న నరేష్ అతన్ని కిడ్నాప్ చేసి కోట్లు రాబట్టేందుకు పథకం వేశాడు. అందులో భాగంగా కర్ణాటక రాష్ట్రంలోని కోలార్‌కు చెందిన సురేష్, శ్రీనివాస్, ఖలందర్, అజయ్, విజయ్, భార్గవ్, ప్రభు, ప్రకాష్, రంజిత్.. అనంతపురం జిల్లాకు చెందిన రవికుమార్, రంజిత్‌కుమార్, చెన్నా భాస్కర్, రఘులతో కిడ్నాప్‌నకు తెరలేపారు. అందరూ కలిసి గత జూన్ 3న బనగానపల్లిలో రెక్కీ నిర్వహించారు. 5వ తేదీ ఉదయం బనగానపల్లి నుంచి బేతంచర్లకు వినాయకరెడ్డితో పాటు ఆయన కుమారుడు భరత్‌కుమార్‌రెడ్డి డ్రైవర్‌తో కలిసి కారులో బయలుదేరారు. అదే సమయంలో కిడ్నాపర్లు నాలుగు కార్లలో వెంబడించి సీతారామాపురం మెట్ట వద్ద అడ్డగించారు. కత్తిని చూపించి భరత్‌కుమార్‌రెడ్డి, వినాయకరెడ్డిలను కిందకు దించారు. వారిని కిడ్నాపర్ల కారులో ఎక్కిస్తుండగా డ్రైవర్ సాయినాథ్‌రెడ్డి అడ్డుకున్నారు. కిడ్నాపర్లు తండ్రీ కొడుకులతో పాటు డ్రైవర్‌ను కూడా కారులోకి కుక్కి ఎత్తుకెళ్లారు. ఆ తర్వాత వినాయకరెడ్డి తండ్రి నాగిరెడ్డికి ఫోన్ చేసి రూ.4 కోట్లు ఇవ్వాలని, లేకుంటే వాళ్లను చంపుతామని బెదిరించారు. భయపడిన నాగిరెడ్డి బంధువుల వద్ద డబ్బు తీసుకుని మొదటగా అనంతపురం జిల్లా కొత్తపల్లి వద్ద రూ.2 కోట్లు.. ఆ తర్వాత కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ వద్ద రూ.2 కోట్లు ముట్టజెప్పాడు. దీంతో కిడ్నాపర్లు 7వ తేదీన కర్ణాటక రాష్ట్రంలో ముగ్గురినీ విడిచిపెట్టారు. అయితే కిడ్నాపర్లు డబ్బు తీసుకొని కూడా తమ కుమారుడిని, మనవడిని వదిలిపెట్టరేమోనన్న ఆందోళనతో నాగిరెడ్డి జరిగిన విషయాన్ని బేతంచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రంగంలోకి దిగిన పోలీసులు

ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు తమదైన శైలిలో విచారణ కొనసాగించారు. ఇంతలోనే కిడ్నాప్‌నకు గురైన ముగ్గురూ ఇంటికి చేరుకున్నారు. అయితే పోలీసులు జూన్ 30న గుత్తి పట్టణంలో 11 మందిని అరెస్ట్ చేసి రూ.40 లక్షల నగదు, కత్తి, మూడు సెల్‌ఫోన్‌లు, నాలుగు కార్లు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న కిడ్నాప్ ప్రధాన నిందితుడు నరేష్, చెన్నా భాస్కర్, రఘులను శుక్రవారం వేకువజామున అనంతపురం జిల్లా గుత్తి వద్ద అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.2.66 కోట్లు నగదు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. గతంలో స్వాధీనం చేసుకున్న నగదుతో కలిపి మొత్తం రూ.3.6 కోట్లు రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించిన అడిషనల్ ఎస్పీ వెంకటరాముడుతో పాటు డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ ప్రియతమ్‌రెడ్డి, ఎస్‌ఐలు శివశంకర్, నాయక్, రాకేష్, నరేష్, జగదీశ్వరరెడ్డి, రమేష్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, పీఆర్‌ఓ చెన్నయ్యలను ఎస్పీ అభినందించారు.

అనుమానంతోనే హత్యాయత్నం

- నిందితుడి నుంచి నాటు తుపాకీ, ఐదు సీసపు గుండ్లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ హనుమంత్ నాయక్

ఆళ్లగడ్డ: ఐదు రోజుల క్రితం అహోబిలంలో నాటు తుపాకీతో హత్యాతయ్నానికి పాల్పడిన కేసును పోలీసులు ఛేదించారు. భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో ఓ వ్యక్తిని నాటు తుపాకీతో చంపేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో తేలింది. హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడు కాకి రామాంజనేయులును శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ హనుమంత్ నాయక్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. అహోబిలం గ్రామం చెంచుకాలనీకి చెందిన కాకి రామాంజనేయులు అదే కాలనీకి చెందిన అన్న వరుస అయ్యే మోకుల నరసింహ తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని అనుమానం పెంచుకుని అంతమొందించాలని కుట్ర పన్నాడు. రామాంజనేయులు ఈ నెల 15వ తేదీ నరసింహ మరో యువకుడితో కలిసి అడవికి తేనె సేకరించుకునేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా అడవి దారిలో కాపు కాచాడు. ఎదురుగా వస్తున్న నరసింహపై నాటు తుపాకీతో కాల్చగా గురి తప్పి పక్కనున్న యువకుడు పెద్దన్నకు సీసం గుండు తగిలి గాయపడ్డాడు. బాధితుడు పెద్దన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. శుక్రవారం పెద్ద కందుకూరు మెట్ట సమీపంలో రామాంజనేయులు ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అహోబిలం కాశినాయన ఆశ్రమం సమీపంలో దాచి ఉంచిన నాటు తుపాకీ, ఐదు సీసపు గుండ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారు. నిందితుడి అరెస్ట్ చేసిన ఎస్‌ఐ నరసింహులు, సిబ్బంది సురేష్‌రెడ్డి, నాగరాజు, ప్రతాప్, రాధాకృష్ణను ఎస్పీ రఘువీర్ రెడ్డి అభినందించినట్లు సీఐ తెలిపారు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టండి

నంద్యాల: జిల్లాలో రహదారి ప్రమాదాలను నియంత్రణకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఆర్‌టీఓ జీవీ శివారెడ్డి, డీఎస్పీలు, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో గుర్తించిన 25 బ్లాక్ స్పాట్లలో పెండింగ్‌లో ఉన్న పనులను వచ్చే సమావేశం నాటికి పూర్తి చేయాలని మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, ఏపీఆర్‌డీసీ అధికారులకు సూచించారు. ఆత్మకూరు ఎన్‌హెచ్ 40 రహదారి విస్తరణ, ఎన్‌హెచ్ 44 రోడ్డులోని టోల్ గేట్ నుంచి డోన్ వరకు లైటింగ్, నిఘా కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బేతంచెర్ల, ఆళ్లగడ్డ, డోన్ తదితర ప్రాంతాల్లో గుర్తించిన 34 బ్లాక్ స్పాట్ల ప్రమాదకరమైన మలుపుల్లో స్పీడ్ బ్రేకర్లు, ప్రధాన హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు ఆర్‌అండ్‌బీ ప్రతిపాదనల మేరకు జాతీయ రహదారుల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రహదారి ప్రమాదాల నియంత్రణకు సంబంధిత శాఖలను సమన్వయం చేసుకొని కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆర్‌టీఓ శివారెడ్డిని ఆదేశించారు. జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర రహదారుల్లో బ్లాక్ స్పాట్లను గుర్తించి ఆయా శాఖల అధికారుల సమన్వయంతో ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. జిల్లాలో గత రెండు సంవత్సరాలతో పోలిస్తే ఈ ఏడాది 30 శాతం వరకు ప్రమాదాల బారిన పడిన మరణాల సంఖ్యను తగ్గించగలిగామన్నారు. పాఠశాలలు, కళాశాలలు, తదితర విద్యాసంస్థల్లో విద్యార్థులకు ప్రమాదాల నివారణపై ప్రత్యేక సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే స్పందించి సమాచారం అందించి ఆదుకునే వారికి ప్రభుత్వం పరంగా రూ.5వేలు పారితోషికం ఇచ్చే విషయంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు.